ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3



అనకాపల్లి

జిల్లా వార్తలు

సోమవారం 1 సెప్టెంబరు 2025



సిబ్బంది లేకపోవడంతో ఖాళీగా వున్న నాతవరం-1 సచివాలయం

గజానికో గొయ్యి!

అనకపల్లి-పైడివాడ అగ్రహారం మధ్య దుర్లభంగా మారిన ప్రయాణం

- భారీ గోతులతో పాడైపోతున్న వాహనాలు
- రహదారిని పూర్తిస్థాయిలో పటిష్ఠం చేయాలని ప్రజల వినతి
- వర్షాకాలం ముగిసిన వెంటనే పనులు చేపడతామని అధికారులు వెల్లడి

సబ్బవరం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అసకపల్లి- లంకెలపాలెం రోడ్డులో ప్రయాణం దుర్లభంగా మారింది. ముఖ్యంగా అసకపల్లి నుంచి పైడివాడఅగ్రహారం వరకు దాదాపు మూడు కిలోమీటర్ల మేర రోడ్డు మొత్తం ఛిద్రమైంది. ఈ రోడ్డులో పరవాడ, సబ్బవరం మండలాలతోపాటు ఇతర మండలాలకు చెందిన పలు గ్రామాల ప్రజలు, రవాణా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. పలుచోట్ల భారీ గోతులు ఏర్పడడంతో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, వ్యాన్లు పాడైపో తున్నాయని వాహన దారులు వాపోతున్నారు. కొద్దిపాటి వర్షం కురిసినా.. గోతుల్లో నీరు చేరి పరిస్థితి మరింత దారుణంగా తయారవుతున్నది. రవాణా వాహహనాలు బోల్తాపడడం, గోతుల్లో కూరుకుపోవడం వంటి సందర్భాలు కూడా వున్నాయి. రాత్రిపూట ఈ మార్గంలో ప్రయాణం ప్రమాదకరమని ద్విచక్ర వాహన దారులు అంటున్నారు. వైసీపీ హయాంలో విశాఖపట్నం-రాయపూర్ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణ పనుల కోసం పరవాడ ఎన్‌టీపీసీ నుంచి ఫ్లైయాష్ (బూడిద)ను భారీ వాహనాల్లో ఈ మార్గం ద్వారానే రవాణా చేశారు. వీటి కారణంగానే రహదారి ధ్వంసం అయ్యిందని, అయినా సరే అప్పటి పాలకులు పట్టించుకోలేదని ఈ రోడ్డులో ప్రయాణించే పలు గ్రామాల ప్రజలు చెబుతున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు చొరవ తీసుకుని, ఎన్‌టీపీసీ నుంచి సీఎస్ఆర్ నిధులు మంజూరు ... మిగతా 4వ పేజీలో



ఎరుకునాయుడుపాలెం సమీపంలో కోనేరు వద్ద ఆనవాళ్లు లేని తారు రోడ్డు



అసకపల్లి- ఎరుకునాయుడుపాలెం మధ్య హిందుస్థాన్ ప్లాస్టిక్ కంపెనీ వద్ద ఛిద్రమైన రహదారి

సచివాలయాలు వెలవెల

నాతవరం మండలంలో 60 శాతం పోస్టులు ఖాళీ

- మొత్తం సచివాలయాలు-17
- ఒక్కో ఆఫీస్‌లో 11 మంది చొప్పున 187 మంది అవసరం
- ప్రస్తుతం ఉన్నది 76 మంది మాత్రమే.. ఖాళీలు-111
- జూన్‌లో ఇక్కడి నుంచి 48 మంది బదిలీ
- వేరే మండలాల నుంచి 36 మంది మాత్రమే రాక



నాతవరంలో సచివాలయం భవనం

- వివిధ రకాల సేవల్లో తీవ్రజాప్యం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

నాతవరం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామ సచివాలయాల్లో సిబ్బంది కొరత తీవ్రంగా వుంది. ఒక్కో సచివాలయంలో 11 మంది చొప్పున 17 సచివాలయాల్లో 187 మంది వుండాలి. కానీ ప్రస్తుతం 76 మంది (40 శాతం) మాత్రమే వున్నారు. ఒక్క సచివాలయంలో కూడా పూర్తిస్థాయిలో ఉద్యోగులు లేరు. మొత్తం మీద 111 పోస్టులు ఖాళీగా వున్నాయి. సిబ్బంది కొరత కారణంగా ప్రజలకు సేవలు అందించడంలో తీవ్ర జాప్యం జరుగుతున్నది. ముఖ్యంగా వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్థక సహాయకుల పోస్టులు అధిక సంఖ్యలో ఖాళీలు వుండడంతో ప్రస్తుత ఖరీఫ్ సీజన్ రైతులకు సకాలంలో సలహాలు, సూచనలు అందడంలేదు.

డిజిటల్ అసిస్టెంట్స్, వేల్ఫేర్ అసిస్టెంట్స్, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు పూర్తిస్థాయిలో లేకపోవడంతో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఇతర పనుల్లో జాప్యం కారణంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ ఏడాది జూన్‌లో బదిలీలు జరగడానికి ముందు మొత్తం 86 మంది ఉద్యోగులు వుండేవారు. ఇక్కడి నుంచి 48 మంది ఇతర మండలాలకు బదిలీ అయ్యారు. వేరే మండలాల నుంచి నాతవరం మండలానికి 38 మంది మాత్రమే వచ్చారు. గన్నవరం, నాతవరం-2 సచివాలయాల్లో ఇద్దరేసి ఉద్యోగులు మాత్రమే వుండడంతో వీటి పరిధిలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సచివాలయాల వారీగా ఖాళీ పోస్టుల వివరాలను పరిశీలిస్తే.. చమ్మచింత-6, చెర్లోపాలెం-5, డియ్యవరం-6, గన్నవరం-9, గొలుగొండపేట-6, గుమ్మిడిగొండ-5 గునుపూడి-8, ఎంబీపట్నం-8, ఎం.బెన్నవరం-6, మన్యపురట్ల-5, నాతవరం ఒకటి-8, నాతవరం రెండు-9, పీకేగూడెం-6, సరుగుడు-6, శృంగవరం-6, వల్సంపేట-6, వైడీపేట-6. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సచివాలయాల్లో కనీసస్థాయిలో ఉద్యోగులు ఉండేలా చూడాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆకట్టుకుంటున్న స్వయంభూ విఘ్నేశ్వరుడు



చోడవరం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్వయంభూ విఘ్నేశ్వరాలయంలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదవ రోజైన ఆదివారం స్వయంభూ గణేశుడు భస్మసహిత చందన వర్ణంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు కొడమంచిలి చలపతి ఆధ్వర్యంలో పూజాదికాలు నిర్వహించారు. స్వయం భూ గణపతిని పలువురు భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

భస్మసహిత చందన వర్ణంలో దర్శనమిస్తున్న స్వయంభూ విఘ్నేశ్వరుడు

పసిఫిక్ కప్ స్కేటింగ్‌లో సత్తా చాటిన చైత్ర దీపిక

- ఆస్ట్రేలియాలో జరిగిన పోటీల్లో మూడు పసిడి పతకాలు కైవసం

నర్సీపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియాలోని వారెన్‌లో జరిగిన 2025 వరల్డ్ స్కేటింగ్ పసిఫిక్ కప్ పోటీల్లో నర్సీపట్నం వెంకునాయుడుపేటకు చెందిన పెదిరెడ్ల చైత్ర దీపిక సత్తా చాటి మూడు బంగారు పతకాలకు కైవసం చేసుకుంది. ఆగస్టు 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు నిర్వహించిన ఈ పోటీల్లో ఇన్‌లైన్, పెయిర్ స్కేటింగ్, కపుల్ డాన్స్ విభాగాల్లో చైత్ర దీపిక ఉత్తమ ప్రతిభ చూపింది.



పెయిర్ స్కేటింగ్‌లో బంగారు పతకం సాధించిన చైత్ర దీపిక

నూకాంబిక సన్నిధిలో హోం మంత్రి

- కుటుంబ సభ్యులతో కలిసి ఘటాలతో ఆలయానికి రాక
- మొక్కులు తీర్చుకున్న వంగలపూడి అనిత





నూకాంబిక అమ్మవారి బాలాలయంలో హోం మంత్రి అనిత. (ఇన్‌సెట్‌లో) ఘటాలతో ఆలయానికి వస్తున్న మంత్రి, కుటుంబ సభ్యులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి స్థానిక నూకాంబిక అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. తొలుత ఆలయానికి సమీపంలోని ఒక ఫంక్షన్ హాల్ నుంచి అనిత, కుటుంబ సభ్యులు అమ్మవారి ఘటాలను మోసుకుంటూ బాలాలయానికి చేరుకున్నారు.

ఆలయ ఈవో కేఎల్ సుధారాణి, ఆలయ మాజీ ఛైర్మన్ పీలా నాగశ్రీను తదితరులు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఘటాలను అమ్మవారికి సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ మండపంలో వేదపండితులు ఆశీర్వచనం అందించారు. ఈ కార్యక్రమంలో ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర, డీసీఎంఎస్ ఛైర్మన్ కోట్ని బాలాజీ, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో క్యాన్సర్‌కు అత్యాధునిక వైద్యం

రూ.45 కోట్లతో మూడు పరికరాలు సమకూర్చిన ప్రభుత్వం

- నేడు ప్రారంభించనున్న వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్

విశాఖపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌లో అత్యాధునిక క్యాన్సర్ వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.45 కోట్లు వెచ్చించి మూడు పరికరాలు కొనుగోలు చేసింది. ఉత్తరాంధ్ర జిల్లాల క్యాన్సర్ బాధితుల్లో అత్యధికశాతం మంది వైద్య సేవల కోసం కేజీహెచ్‌ను ఆశ్రయిస్తారు. వీరికి అత్యాధునిక సేవలు అందించే ఉద్దేశంతో ప్రభుత్వం రెండేళ్ల కిందట కాంప్రహెన్సివ్ క్యాన్సర్ కేర్ సెంటర్‌ను మంజూరు చేసింది. అందుకు అవసరమైన అత్యాధునిక వైద్య పరికరాలను కొనుగోలు చేసింది. వీటి అమరిక, ప్రత్యేక గదులు, ఇతర సౌకర్యాల దిశగా అధికారులు ఏడాదిగా కృషిచేస్తున్నారు. ఈ పనులు ఇటీవల పూర్తికావడంతో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ సోమవారం వాటిని ప్రారంభించనున్నారు.



లీనియర్ యాక్సెలరేటర్



సీటీ సిములేటర్

ఇవీ పరికరాలు..

కేజీహెచ్‌కు ప్రభుత్వం సమకూర్చిన పరికరాల్లో లీని యర్ యాక్సలరేటర్, హెచ్‌డీఆర్ బ్రాకీ థెరపీ, సీటీ సిమ్యు లేటర్ ఉన్నాయి. ఇందులో లీనియర్ యాక్సలరేటర్ అడ్వాన్స్‌డ్ రేడియేషన్ అందించేందుకు ఉపకరిస్తుంది. హెచ్‌డీఆర్ బ్రాకీథెరపీ మెషీన్ ద్వారా శరీరంలోని అంతర్గత భాగాల్లో ఉన్న కణతుల లోపలకు రేడియేషన్ ఇవ్వవచ్చు. ఇక సీటీ సిములేటర్ పరికరం ద్వారా స్కానింగ్ చేస్తారు. అనంతరం ఈ ఇమేజ్‌లు కంప్యూటర్‌కు వెళతా యి. కొన్ని కంప్యూటర్లతో కూడిన కంట్రోలింగ్ స్టేషన్ ఉంటుంది. అక్కడ ఈ ఇమేజ్‌లను పూర్తిస్థాయిలో పరిశీలించి ఎక్కడ ఏ భాగానికి రేడియేషన్ ఇవ్వాలో గుర్తిస్తారు. దీనివల్ల సూక్ష్మాతి సూక్ష్మంగా ఉన్న కణితులు, ఇతర భాగాలపై రేడియేషన్ ప్రభావం పడకుండా చూసే వీలుంటుందని ... మిగతా 4వ పేజీలో

కనీస వేతనాలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి

- ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి డిమాండ్

అనకాపల్లి టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఆశ కార్యకర్తలకు కనీస వేతనాలు అమలు చేయాలని ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.ధనలక్ష్మి డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా ఏడవ మహాసభ ఆదివారం స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో జిల్లా అధ్యక్షురాలు కె.శాంతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ, ఆశ కార్యకర్తలు చేస్తున్న చాకిరికి, ప్రభుత్వం చెల్లిస్తున్న గౌరవభృతికి ఎటువంటి పొంతన లేదని, చాలీచాలని వేతనాలతో జీవిస్తున్నారని అన్నారు. ఆశ కార్యకర్తలు గ్రామాల్లో మాత్రమే విధులు నిర్వహించాలని, కానీ రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆరోగ్య ఉపకేంద్రాల్లోనే వుండాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ఒత్తిడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి ఆర్.శంకరరావు మాట్లాడుతూ, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఆశ వర్కర్ల వేతనాలు పెంచుతామని గత ఏడాది సాధారణ ఎన్నికల ముందు కూటమి పార్టీల నాయకులు హామీ ఇచ్చారని, కానీఇంతవరకు అమలు చేయలేదని అన్నారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు కె.వరలక్ష్మి, ఈ.పార్వతి, బి.సత్యవతి, బి.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జలాశయాలకు వరద పోటు


గరిష్ఠస్థాయికి చేరిన రైవాడ, పెద్దేరు రిజర్వాయర్లు

- స్పిల్‌వే గేట్ల నుంచి అదనపు నీరు దిగువకు విడుదల

పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో శారదా, పెద్దేరు, బొడ్డేరు, సర్పా నదుల్లో నీటి ప్రవాహం పెరిగింది. దీంతో రైవాడ, పెద్దేరు, కోనాం, కల్యాణపులోవ జలాశయాల్లోకి వరద నీరు చేరుతున్నది. రైవాడ, పెద్దేరు రిజర్వాయర్లు ఇప్పటికే పూర్తిగా నిండడంతో అధికారులు స్పిల్‌వే గేట్లు ఎత్తి అదనపు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.



నిండు కుండలా రైవాడ జలాశయం



నీటితో కళకళలాడుతున్న కల్యాణపులోవ రిజర్వాయర్

దేవరాపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైవాడ జలాశయంలోకి సమ్మెద, పినకోట చల్లగెడ్డల నుంచి ఆదివారం 900 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతున్నది. గరిష్ఠ నీటిమట్టం 114 మీటర్లుకాగా, రిజర్వాయర్‌లో 113.5 మీటర్ల వద్ద నీటి నిల్వలను అధికారులు క్రమబద్ధీకరిస్తూ అదనపు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎడమ కాలువకు 100 క్యూసెక్కులు, విశాఖ నగర పాలక సంస్థకు 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఇన్‌ఫ్లోనుబట్టి ఆదివారం రాత్రి స్పిల్‌గేటు ఎత్తి నీటిని నదిలోకి విడుదల చేసే అవకాశం వుందని డీఈఈ సత్యంనాయుడు తెలిపారు.

పెద్దేరు నుంచి 350 క్యూసెక్కులు విడుదల

మాడుగుల రూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దేరు జలాశయంలోకి ఆదివారం 248 క్యూసెక్కుల వరద నీరు చేరుతున్నది. గరిష్ఠ ... మిగతా 4వ పేజీలో



'మిస్ విశాఖ-2025' కిరీటంతో డాక్టర్ సృజనాదేవి

మిస్ విశాఖ డాక్టర్ సృజనాదేవి

విశాఖపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): విశాఖలోని హోటల్ నోవాటెల్‌లో ఆదివారం నిర్వహించిన అందాల పోటీల్లో డాక్టర్ సృజనాదేవి మొదటి స్థానంలో నిలిచి 'మిస్ విశాఖ-2025' కిరీటం దక్కించుకున్నారు. ఫరెవర్ మిస్ ఇండియా జాతీయ స్థాయిలో నిర్వహించే అందాల పోటీల్లో మహిళలకు ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వ వికాసం ఆధారంగా పురస్కారం ప్రకటించి అందాల కిరీటం ప్రదానం చేస్తారు. త్వరలో రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరిగే జాతీయ గ్రాండ్ ఫినాలేలో డాక్టర్ సృజన పాల్గొంటారు. ఈమె కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్, తమిళనాడులో అనెస్థీషియాలో ఎండీ పూర్తి చేసి విశాఖలోని ఒక ప్రముఖ ఆస్పత్రిలో సేవలు అందిస్తున్నారు.

మత్స్యకార సంఘం మండల అధ్యక్షుడిగా ఎరుపిల్లి



అప్పలరాజును సత్కరిస్తున్న సంఘ ప్రతినిధులు

నక్కపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జాతీయ మత్స్యకార సంఘం మండల శాఖ అధ్యక్షుడిగా అమలాపురం గ్రామానికి చెందిన మత్స్యకార నాయకుడు ఎరుపిల్లి అప్పలరాజు నియమితులయ్యారు. ఆదివారం నక్కపల్లి నూకాలమ్మ ఆలయం వద్ద నిర్వహించిన సమావేశంలో జాతీయ మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోసా అప్పలరాజు ఈ మేరకు నియామక ఉత్తర్వులను ఎరుపల్లికి అందజేశారు. అనంతరం ఎరుపిల్లితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎరుపిల్లి అప్పలరాజు మాట్లాడుతూ త్వరలో మత్స్యకార గ్రామాల్లో చురుకైన యువకులతో గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తానన్నారు. ఈ సమావేశంలో సంఘ ప్రతినిధులు పిక్కి కొర్లయ్య, కొవిరి వెంకటేశ్, ఎం.జగ్గారావు, అమ్మోరియ్య, సత్యం, బాబ్జీ, గోపీ పాల్గొన్నారు.

పాయకరావుపేటలో భారీ వర్షం



పాయకరావుపేటలో పడుతున్న వర్షం

పాయకరావుపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఆదివారం పట్టణంలో భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం గంటపాటు పడిన వర్షానికి పట్టణంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పంచాయతీ కాలువల్లోని మురికినీరు వర్షపు నీటితో కలిసి రోడ్లపై ప్రవహించింది. పలు కాలనీల్లో ఖాళీ స్థలాలు మురికినీటితో చెరువులుగా మారాయి. మెయిన్‌రోడ్డులో పల్లపు ప్రాంతాలు చిన్నపాటి చెరువులను తలపించాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

మునగపాకలో పారిశుధ్య కార్మికుల నిరసన

మునగపాక, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో కొంత మంది ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ ఆదివారం మునగపాకలో పారిశుధ్య కార్మికులు విధులను బహిష్కరించారు. అనంతరం మునగపాక సంపద కేంద్రం వద్ద నిరసనకు దిగారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికుడు వినోద్ మాట్లాడుతూ సక్రమంగా విధులు నిర్వహిస్తున్నా కొంతమంది తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, అంతేకాకుండా దౌర్జన్యానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్మికులు నిరసనతో ఆదివారం గ్రామంలో చెత్తసేకరణ నిలిచిపోయింది. దీంతో చెత్తడబ్బాలు వీధుల్లో దర్శనమిస్తున్నాయి.

మదర్ మెమోరియల్ సేవలు అభినందనీయం

- మాజీ ఎంపీపీ కొయిలాడ వెంకట్



నిత్యావసరాల కిట్‌లు అందజేస్తున్న వెంకట్, ఆళ్ల శ్రీనివాసరావు

మునగపాక, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మదర్ మెమోరియల్ సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమని మాజీ ఎంపీపీ కొయిలాడ వెంకట్ అన్నారు. మండలంలో గవర్ల అనకాపల్లి రామాలయం వద్ద ఆదివారం స్వర్గీయ ఆళ్ల వరలక్ష్మి జ్ఞాపకార్థం పేదలకు చలి కోట్లు, నిత్యావసర సరుకులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ ఆళ్ల శ్రీనివాసరావు ఐదేళ్లుగా గ్రామంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో ఆళ్ల శ్రీనివాసరావు, ఆళ్ల భాగ్యలక్ష్మి, కుషల్, నెహల్, బి.రాము, ఎ.సూరిబాబు, దాడి శ్రీను, పరమేష్, ఎం.నాయుడు, బి.రవి తదితరులు పాల్గొన్నారు.

'రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలి'

ఎస్.రాయవరం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతులందరికీ సరిపడా యూరియా సరఫరా చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. మండలంలోని ధర్మవరం అగ్రహారం గ్రామంలో వరినాట్లు వేసిన పంట పొలాలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా వరినాట్లు వేసిన రైతులకు యూరియా సరఫరా చేయకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సొసైటీల ద్వారా రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు పొంతన లేని ప్రకటనలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం రైతులకు యూరియా అందించాలన్నారు.

అక్రమంగా నిర్మించిన గోడను కూల్చివేయండి

- రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆదేశం
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



రాజుగారిబీడులో కబ్జాకి గురైన పంచాయతీ స్థలం

పాయకరావుపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాజుగారి బీడులో పంచాయతీ స్థలం చుట్టూ నిర్మించిన ప్రహరీగోడను కూల్చివేయాలని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. పట్టణంలోని రాజుగారిబీడులో సర్వే నం.175, 176లలో వేసిన లేఅవుట్‌లో పంచాయతీకి కేటాయించిన కమ్యూనిటీ స్థలం చుట్టూ బయటి వ్యక్తులు ఇటీవల ప్రహరీగోడ నిర్మాణం చేపట్టడంపై ఆదివారం 'దర్జాగా పంచాయతీ స్థలం కబ్జా' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై హోం మంత్రి అనిత స్పందించారు. ప్రహరీని వెంటనే తొలగించాలని స్థానిక అధికారులను ఆదేశించారు. దీనిపై డిప్యూటీ ఎంపీడీఓ, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి కె.డేవిడ్‌ని వివరణ కోరగా.. హోం మంత్రి ఆదేశాల మేరకు పంచాయతీ స్థలంలో అక్రమంగా నిర్మించిన ప్రహరీగోడను సిబ్బందితో సోమవారం తొలగిస్తామన్నారు. అవసరాన్ని బట్టి పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు.

వైభవంగా వినాయక నిమజ్జనం



పాయకరావుపేటలో వినాయక నిమజ్జనం ఊరేగింపు నిర్వహిస్తున్న ప్రజలు



పూడిమడకలో సిద్ధి వినాయక మందిరం వద్ద కుంకుమ పూజలు

పాయకరావుపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి):పట్టణంలో వినాయక నిమజ్జనం ఆదివారం సందడిగా నిర్వహించారు. పట్టణంలోని పలు కూడళ్లు, ఆపార్టుమెంట్లలో ఏర్పాటుచేసిన వేదికల్లో ప్రతిష్ఠించిన స్వామి వారికి ప్రత్యేక పూజలు అనంతరం వినాయక విగ్రహాలను వాహనాల్లో ఊరేగించారు. రోడ్లపై ఉత్సాహంగా డాన్సులు వేసి అందరినీ అలరించారు. ప్రజలకు ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం విగ్రహాలను నిమజ్జనం చేశారు. నిమజ్జనం కార్యక్రమాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేసినట్టు సీఐ జి.అప్పన్న తెలిపారు. అలాగే స్థానిక బృందావనంలో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సామూహిక సరస్వతి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో..

మండలంలోని పూడిమడక వినాయక మండపాల్లో ఆదివారం సామూహిక లక్ష్మీగణపతి కుంకుమ పూజలు జరిగాయి. పూడిమడక పాతబస్టాండ్ వద్ద గల సిద్ధి వినాయక, కడపాలెం లింగాల దిబ్బ వద్ద బాల గణపతి, కొండపాలెం గణపతి మండపాల వద్ద కుంకుమ పూజలు జరిగాయి.

మునగపాకలో..

మండలంలో పలు గ్రామాల్లో వినాయక పందిర్ల వద్ద ఆదివారం అన్నసమారాధనలు జరిగాయి. మునగపాకలో అంబేడ్కర్ కాలనీ, పురిటిగెడ్డ కొత్త మహలక్ష్మి, ఎన్టీఆర్ కాలనీ, బైపాసు రోడ్డు సెల్‌టవర్ వద్ద, తులసీ కల్యాణ మండపానికి సమీపంలోను అన్నసమారాధనలు జరిగాయి.

విఘ్నేశ్వరస్వామి ఆలయంలో లక్ష గరిక పూజ

- పాల్గొన్న ఎమ్మెల్యే విజయకుమార్



లక్ష గరిక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయకుమార్

ఎలమంచిలి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పెదపల్లిలోని విఘ్నేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం లక్ష గరిక పూజను ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన సిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుపుతున్నారు. ఆదివారం నిర్వహించిన లక్ష గరిక పూజలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, స్థానిక నేతలు స్వామివారిని దర్శించుకున్నారు. ఎంతో వైభవంగా నిర్వహించిన ఈ పూజా కార్యక్రమంలో గ్రామస్థులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ముమ్మరంగా వరి నాట్లు



పాయకరావుపేట రూరల్: గోపాలపట్నం ప్రాంతంలో దమ్ము పడుతున్న దృశ్యం



కోటవురట్ల మండలం జల్లూరులో నాట్లు వేస్తున్న కూలీలు

పాయకరావుపేట రూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు తాండవ నదిలో పుష్కలంగా నీరు ప్రవహించడం, సాగునీటి కాలువల ద్వారా పొలాలకు నీరు చేరుతుండడంతో రైతులు దమ్ములు పట్టి జోరుగా వరి నాట్లు వేస్తున్నారు. మండలంలో సత్యవరం, మాసాహెబ్‌పేట, మంగవరం, పెంటకోట, గోపాలపట్నం, అరట్లకోట, శ్రీరాంపురం, పెదరాంభద్రపురం, నామవరం, గుంటపల్లి, కేశవరం, తదితర గ్రామాలలో రైతులు వరి నాట్లు పనులలో బిజీగా ఉన్నారు. రైతులందరూ ఒకేసారి వరి నాట్లు ప్రారంభించడంతో కూలీలకు డిమాండ్ ఏర్పడింది. మండలంలో సాగునీటి కాలువలు, చెరువులు, బోర్లు కింద 2,630 హెక్టార్లలో రైతులు వరిని సాగు చేస్తున్నారు. ఇప్పటికి 1800 హెక్టార్లలో వరి నాట్లు పూర్తయినట్టు వ్యవసాయాధికారి ఆదినారాయణ తెలిపారు. సెప్టెంబరు రెండో వారానికి వరి నాట్లు పూర్తవుతాయన్నారు. రైతులకు ఎరువుల కొరత లేదన్నారు. యూరియా, డీఏపీ ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు.

కోటవురట్లలో..

మండలంలో 1,238 హెక్టార్లలో వరినాట్లు వేశారు. ఇటీవల కురిసిన వర్షాలతో సాగునీటి వనరుల్లో నీరు చేరడంతో రైతులు ముమ్మరంగా వరినాట్లు వేశారు. మండలంలో వరి సాధారణ విస్తీర్ణం 1,749 హెక్టార్లు కాగా ఇప్పటి వరకు 1,238 హెక్టార్లలో వరి నాట్లు పడ్డాయి. ఇటీవల కురిసిన వాగులు, గెడ్డలు పొంగి ప్రవహించాయి. చెరువుల్లో సాగునీరు చేరడం, తాండవ కాలువ నీరు ప్రవహించడంతో వరినాట్లు వేసేందుకు రైతులు ఉత్సాహంగా చూపుతున్నారు. మండలంలో పల్లపు ప్రాంతాలైన కోటవురట్ల, అన్నవరం, యండపల్లి, జల్లూరు సుంకపూర్, తంగేడు రాజుపేట, కైలాసపట్నం, బీకేపల్లి గ్రామాల్లో వరినాట్లు పూర్తిగా వేశారు. అయితే ప్రస్తుతం బోడపాలెం, పాములవాక, నీలిగుంట, తదితర గ్రామాల్లో రైతులు దమ్ములు పడుతున్నారు. కూలీలకు పనులు ముమ్మరంగా దొరుకుతున్నాయి. ఈ ఏడాది మహిళకు రోజు కూలి రూ.300 నుంచి రూ.350 ఇస్తున్నారు. కూలీల రేట్లు పెరిగిపోవడంతో రైతులపై ఆర్థిక భారం పడింది.

'వీఎంఆర్డీఏ నోటీసుని వెనక్కి తీసుకోవాలి'

అచ్యుతాపురం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు విస్తరణపై అభ్యంతరాలుంటే తెలియజేయాలని వీఎంఆర్డీఏ వెబ్‌సైట్‌లో పెట్టిన నోటీసును వెనక్కి తీసుకోవాలని రోడ్డు నిర్వాసితుల సంఘం కో-కన్వీనర్ కె. రామసదాశివరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయనిక్కడ విలేకర్లతో మాట్లాడుతూ అధికారులు ఇంతవరకు పలుమార్లు నిర్వాసితులతో సమావేశాలు ఏర్పాటు చేశారని, టీడీఆర్ బ్యాండ్లు వద్దని నగదు రూపంలో పరిహారం చెల్లించాలని కోరారన్నారు. విలేకర్ల సమావేశంలో రొంగలి రాము, కర్రి అప్పారావు, బుద్ధ రంగారావు, బి. రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మునగపాకలో..

అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు నిర్వాసితులకు డిజిటల్ రూపంలో కాకుండా నోటీసులు లిఖితపూర్వకంగా ఇవ్వాలని నిర్వాసితులు సంఘం నాయకుడు ఎస్.బ్రహ్మాజి అన్నారు. స్థానిక సహకార సంఘం జంక్షన్ వద్ద ఆదివారం పలువురు నిర్వాసితులు నిరసన వ్యక్తం చేశారు. భూసేకరణకు సంబంధించి అభ్యంతరాలు ఉంటే వీఎంఆర్డీఏకు తెలియజేసుకోవాలని వాట్సాప్ ద్వారా నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో పెంటకోట ఆదినారాయణనాయుడు, ఆడారి శ్రీనివాసనాయుడు, జగన్నాథరావు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

టీడీపీ నేతకు పరామర్శ

పాయకరావుపేట రూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సత్యవరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు అంగిరెడ్డి కుమార్ ఇటీవల కాలుకి శస్త్రచికిత్స చేయించుకోవడంతో ఆదివారం టీడీపీ నాయకులు పెదిరెడ్డి చిట్టిబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ కంకిపాటి వెంకటేశ్వరరావు తదితరులు పరామర్శించారు. యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కీర్తి సీతారాం, పెదిరెడ్డి శ్రీరాములు, వద్దాది వాసు, శిధిరెడ్డి నాగేశ్వరరావు, బొలిశెట్టి నాగేశ్వరరావు, వేములపూడి అప్పారావు, దువ్వ శ్రీనివాస్ పాల్గొన్నారు.

గజానికో గొయ్యి!

... 3వ పేజీ తరువాయి



ఎరుకునాయుడుపాలెం సమీపంలో రోడ్డుపై ఏర్పడిన గోతులు

చేయించారు. దీంతో గత మార్చిలో లంకెలపాలెం నుంచి పైడివాడఅగ్రహారం వరకు రహదారికి నిర్వహణ పనులు చేశారు. అక్కడి నుంచి అసకపల్లి వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర రహదారిపై ఏర్పడిన గోతులను మెటల్, క్రషర్ బుగ్గితో కప్పారు. అయితే గత పక్షం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో క్రషర్ బుగ్గితోపాటు మెటల్ కూడా కొట్టుకుపోయి, గోతులు మళ్లీ ప్రత్యక్షం అయ్యాయి.

రూ.2 కోట్లు మంజూరు

బాలరాజు, ఏఈ, ఆర్‌అండ్‌బీ

అసకపల్లి నుంచి పైడివాడఅగ్రహారం వరకు మూడు కిలోమీటర్ల మేర రోడ్డును అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం రూ.2 కోట్లు మంజూరు చేసింది. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున పనులు చేయడానికి వీలుకాదు. త్వరలోట టెండర్ల ప్రక్రియను పూర్తిచేసి, వర్షా కాలం ముగిసిన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

జలాశయాలకు వరద పోటు

... 3వ పేజీ తరువాయి

నీటిమట్టం 137 మీటర్లు కాగా ఆదివారం సాయంత్రానికి 136.55 మీటర్లకు చేరింది. రాత్రి తొమ్మిది గంటలకు స్పిల్‌వే మూడో గేటు తెరిచి 350 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడిచిపెడతామని జలాశయం ఏఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం రాచకట్టు కాలువకు 10 క్యూసెక్కులు, కుడి ప్రధాన కాలువకు 50 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్టు వెల్లడించారు.

స్వల్పంగా పెరిగిన కల్యాణపులోవ నీటి మట్టం

రావికమతం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీమలపాడు పంచాయతీ పరిధిలో వున్న కల్యాణపులోవ రిజర్వాయర్‌లో నీటి నిల్వలు క్రమం పెరుగుతున్నాయి. జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 460 అడుగులు కాగా ఆదివారం 80 క్యూసెక్కుల వరద నీరు వచ్చిచేరుతూ 453.02 అడుగులకు పెరిగింది. వారం రోజుల్లో నీటి మట్టం మూడు అడుగుల పెరిగినట్టు ప్రాజెక్టు ఏఈ సూర్య తెలిపారు. ఆయకట్టుకు సకాలంలో నీటిని విడుదల చేయడంతోపాటు రెండు వారాల నుంచి వర్షాలు సమృద్ధిగా కురుస్తుండడంతో 75 శాతం విస్తీర్ణంలో వరినాట్లు పూర్తయినట్టు ఆయన చెప్పారు. ఖరీఫ్‌కు నీటి ఎద్దడి తలెత్తే అవకాశం లేదని ఆయన స్పష్టం చేశారు.

కేజీహెచ్‌లో క్యాన్సర్‌కు అత్యాధునిక వైద్యం

... 3వ పేజీ తరువాయి

వైద్యులు చెబుతున్నారు. ఈ పరికరాల సాయంతో మెదడు నుంచి కాలిబొటన వేలి వరకూ వచ్చే ఏ క్యాన్సర్‌కు అయినా మెరుగైన చికిత్సను అందిస్తామని విభాగాధిపతి డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. అర సెంటీ మీటర్ నుంచి 40 సెంటీమీటర్ల పరిమాణం ఉన్న ఏ క్యాన్సర్‌కైనా వైద్య సేవలను సులభంగా, అత్యాధునిక పద్ధతుల్లో అందించేందుకు అవకాశం ఉందన్నారు. ఈ పరికరాలతో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి తెలిపారు.

వమ్మవరం అగ్రహారంలో తాగునీరు వృథా

- మరమ్మతుకు గురైన తాగునీటి ట్యాంకు పైపు
- నెలల తరబడి పట్టించుకోని అధికారులు



ట్యాంకు పైపు నుంచి వృథాగా పోతున్న తాగునీరు

ఎస్.రాయవరం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వమ్మవరం శివారు అగ్రహారంలో రక్షిత నీటి పథకం మరమ్మతులకు గురైంది. ట్యాంకు నుంచి పెచ్చులు రాలి పడుతున్నాయి. మోటారు నుంచి ట్యాంకుకు వెళ్లే పైపు దెబ్బతినడంతో తాగునీరు వృథాగా పోతోంది. ఈ పైపు దెబ్బతిని ఆరు నెలల నుంచి తాగునీరు వృథా అవుతున్నా పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పట్టించుకున్న పాపాన పోలేదని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తాగునీటి ట్యాంకుతోపాటు దెబ్బతిన్న పైపును మరమ్మతు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

రామాలయం అభివృద్ధికి ఎస్ఐ రూ.లక్ష విరాళం



రూ.లక్ష విరాళం అందజేస్తున్న ఎస్ఐ మైలపల్లి నాయుడు

మునగపాక, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దళితకాలనీలో రామాలయం అభివృద్ధికి అదే కాలనీకి చెందిన ఎస్ఐ ఎంవీఆర్‌పీ.నాయుడు లక్ష రూపాయలు విరాళం అందజేశారు. రామాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద కమిటీ పెద్దలకు ఆదివారం నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, సహకార సంఘం మాజీ చైర్‌పర్సన్ కోనపల్లి రామ్మోహన్‌రావు, బీలా లక్ష్మణరావు, శివ తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయం భక్తులతో కిటకిట



అమ్మ దర్శనానికి క్యూలో భక్తులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత నూకాంబిక ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. తొలుత తెల్లవారుజామున అర్చకులు బాలాలయంలోని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం దర్శనాలు కల్పించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ జిల్లాల నుంచి భక్తులు కుటుంబ సమేతంగా వచ్చి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం ఈవో కేఎల్ సుధారాణి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రైలు నుంచి జారిపడి అంధుడికి గాయాలు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి రైల్వే స్టేషన్‌కు సమీపంలోని శంకర్ ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఆదివారం తెల్లవారుజామున గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి ప్రమాదవశాత్తూ జారిపడి ఓ అంధుడు తీవ్ర గాయాలకు గురయ్యాడు. ఈ సమాచారం తెలుసుకున్న ఆర్‌పీఎఫ్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడ్ని ఎన్టీఆర్ వైద్యాలయంలో ప్రథమ చికిత్సల అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. గాయపడ్డ వ్యక్తి విజయనగరం జిల్లా భోగాపురం గ్రామానికి చెందిన వ్యక్తిగా తెలిసింది.

పేకాట ఆడుతున్న పది మంది అరెస్టు

కశింకోట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెరకాం- అడ్డాం గ్రామాల పరిసర ప్రాంతాల్లో ఆదివారం పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఇందుకు సంబంధించి సీఐ అల్లు స్వామినాయుడు తెలిపిన వివరాలివి. జీడి తోటలో పేకాట ఆడుతున్నారని అందిన సమాచారం మేరకు ఎస్ఐ మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేశారన్నారు. ఈ సందర్భంగా పది మందిని అదుపులోకి తీసుకోవడంతో పాటు రూ.61,300 నగదు, నాలుగు ద్విచక్ర వాహనాలు, ఆటోను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ కవితగా 'అమరత్వం'



కోరాడ అప్పలరాజును సత్కరించిన సాహితీ ప్రముఖులు

కొత్తూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి కవితల పోటీల్లో అనకాపల్లి మండలం కూండ్రం హైస్కూల్‌కు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు కోరాడ అప్పలరాజు కవిత ఉత్తమంగా ఎంపికైంది. మచిలీపట్నం సాహితీ మిత్రుల ఆధ్వర్యంలో డాక్టర్ శోభ స్మారక కవితల పోటీలను నిర్వహించారు. మూడు వందల మందికి పైగా కవులు హాజరయ్యారు దేశభక్తి అంశంపై 'అమరత్వం' శీర్షికతో అప్పలరాజు రాసిన కవిత ఉత్తమంగా ఎంపిక కావడంతో ప్రముఖ సాహితీవేత్త రావి రంగారావు, సాహితీ ప్రముఖుల జ్ఞాపిక, ప్రశంసా పత్రాన్ని అందజేసినట్టు ఆయన ఇక్కడి విలేకరులకు తెలిపారు.

ఉగ్గినపాలెం రోడ్డుపై గోతులు పూడ్చివేత



సొంత నిధులతో గుంతలను పూడ్పించిన కూటమి నాయకులు

కశింకోట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న ఉగ్గినపాలెం గ్రామ ప్రధాన రోడ్డుపై పడిన గుంతలను పూడ్చేలా కూటమి నాయకులు ఆదివారం చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా కలగ గోవింద, కలగ సోమేశ్వరరావు తదితరులు తమ సొంత నిధులు వెచ్చించి కంకర, నల్ల బుగ్గిని తెప్పించి గోతులను పూడ్పించారు. జాతీయ రహదారి నుంచి గ్రామంలోని ఏలేరు కాలువ వంతెన వరకు ఈ పనులు చేయించారు.

శారదా నదిలో విగ్రహాల నిమజ్జన వేడుక



నదిలో విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న భక్తులు

అనకాపల్లి టౌన్/అనకాపల్లి రూరల్/ కశింకోట/ సబ్బవరం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా వీధి వీధిన ఏర్పాటైన మండపాల్లో ఆదివారం కోలాహల వాతావరణం నెలకొంది. వివిధ రూపాల్లో కొలువుదీరిన బొజ్జగణపయ్యను పలువురు నాయకులు, ప్రముఖులతో పాటు ఆయా ప్రాంతాలవారు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. చాలా చోట్ల అన్నసమారాధనలు జరిపారు. సెలవు దినం కావడంతో భక్తులంతా కుటుంబాలతో హాజరై ప్రసాదాన్ని ఆరగించారు. అలాగే, అనకాపల్లి మండలం సిరసపల్లిలో గల దత్తక్షేత్రంలో కొలువుదీరిన చింతామణి గణపతి ఆలయంలో ఉత్సవమూర్తికి అర్చకులు పంచామృతాలతో పాటు తైలాభిషేకం నిర్వహించారు. ఇదిలావుంటే, అనకాపల్లిలోని శారదా నదిలో పెద్ద సంఖ్యలో స్వామి విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఉదయం నుంచి రాత్రి చాలా సేపటి వరకు ఈ వేడుక సాగుతూనే ఉంది. వాహనాలపై మేళతాళాల నడుమ విగ్రహాలను తెచ్చారు. భారీ విగ్రహాలను జీవీఎంసీ ఏర్పాటు చేసిన క్రేన్ సహాయంతో నదిలో నిమజ్జనం చేశారు. జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి, పట్టణ ఎస్ఐలు ఎ.వెంకటేశ్వరరావు, సంతోష్‌కుమార్, ఏఎస్ఐ సుధా సిబ్బందితో పరిశీలించడంతో పాటు ఎప్పటికప్పుడు మైక్‌లో జాగ్రత్తలను తెలియజేసేవారు.



విగ్రహాల నిమజ్జనాన్ని పరిశీస్తున్న జడ్సీ, పోలీసు అధికారులు

కార్యకర్తలకు ఎల్లప్పుడూ టీడీపీ అండ

సీఎం సహాయ నిధి మంజూరు పత్రాలు, ఇన్సూరెన్స్ చెక్కుల పంపిణీలో హోం మంత్రి అనిత

అనకాపల్లి టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : కార్యకర్తలకు కష్టం వస్తే ఆదుకునేది తెలుగుదేశం పార్టీ మాత్రమేనని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. గవరపాలెంలోని పీలా గోవింద కార్యాలయంలో ఆదివారం 21 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరు పత్రాలతో పాటు పార్టీ సభ్యత్వం తీసుకొని చనిపోయిన ఇద్దరు కార్యకర్తల కుటుంబాలకు రూ.ఐదు లక్షలు చొప్పున చెక్కులను అందజేసి మాట్లాడారు. టీడీపీ అంటేనే గౌరవం గల పార్టీ అని, ఇందులో కార్యకర్తగా ఉండడం గర్వకారణమని పేర్కొన్నారు. టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు భరోసా కల్పించేందుకే ఇన్సూరెన్స్ పథకాన్ని మంత్రి నారా లోకేశ్ ప్రవేశపెట్టారన్నారు. దేశంలో ఏ ప్రాంతీయ పార్టీకి కోటి మంది సభ్యత్వాలు లేవని, ఒక్క టీడీపీకి మాత్రమే ఇది సాధ్యమైందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో సీఎం సహాయ నిధి అంటే ఏమిటో తెలియనివారు ఉండేవారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, డీసీ ఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, టీడీపీ నాయకులు మాదంశెట్టి నీలబాబు, లాలం కాశీనాయుడు, బీఎస్ఎంకే జోగినాయుడు, కాయల మురళీ, సిదిరెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



సీఎం సహాయ నిధి మంజూరు పత్రాన్ని అందిస్తున్న మంత్రి అనిత, చిత్రంలో పీలా గోవింద, బత్తుల, మళ్ల

సంతోషిమాత ఆలయ హుండీ లెక్కింపు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : గవరపాలెం సంతోషిమాత ఆలయం హుండీని లెక్కించారు. నాలుగు నెలల్లో భక్తుల కానుకల రూపంలో రూ.1,52,048, టికెట్ల రూపంలో రూ.1,06,470 ఆదాయం వచ్చినట్టు ఈవో బి.మురళీకృష్ణ తెలిపారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వసంతకుమార్, మాజీ చైర్మన్ మారిశెట్టి భాస్కరరావు పాల్గొన్నారు.

మోదకొండమ్మను దర్శించుకున్న పోలవరం ప్రాజెక్టు పరిపాలనాధికారి అభిషేక్


మోదకొండమ్మను దర్శించుకుంటున్న అభిషేక్

పాడేరురూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పాడేరు మోదకొండమ్మను ప్రస్తుత పోలవరం ప్రాజెక్టు పరిపాలనాధికారి వి.అభిషేక్ ఆదివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో వినాయక విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయనను మోదకొండమ్మ, ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయ కమిటీ ప్రతినిధులు శాలువతో సత్కరించి, అమ్మవారి, స్వామి వారి చిత్రపటాలను బహూకరించారు.

గంజాయి రవాణాకు పాల్పడితే ఉపేక్షించం : ఎస్ఐ


పాత గంజాయి నిందితులతో మాట్లాడుతున్న ఎస్ఐ షణ్ముఖరావు

జి.మాడుగుల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణాకు పాల్పడితే సహించేది లేదని స్థానిక ఎస్ఐ షణ్ముఖరావు హెచ్చరించారు. ఆదివారం ఆయన పాత గంజాయి నేరస్థులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. గంజాయి సాగు, రవాణాపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. గంజాయి సాగుకు బదులుగా ఇతర పంటలను సాగు చేయాలని ఆయన సూచించారు.

ధారకొండలో దుకాణాలను తనిఖీ చేసిన ఎస్ఐ



ధారకొండలో షాపులను తనిఖీ చేస్తున్న సీలేరు ఎస్ఐ రవీంద్ర

సీలేరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం ధారకొండలో ఆదివారం సీలేరు ఎస్ఐ రవీంద్ర ఆధ్వర్యంలో పోలీసులు దుకాణాలను తనిఖీ చేశారు. ధారకొండలో యూరియా బస్తాలను వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తున్నారని పత్రికల్లో వార్తలు రావడంతో సీలేరు ఎస్ఐ తన సిబ్బందితో ధారకొండ వెళ్లి అక్కడ ఉన్న షాపులను తనిఖీలు చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధారకొండ షాపుల్లో ఎక్కడా యూరియా బస్తాలు లభ్యం కాలేదని, ఎవరైనా లైసెన్సులు లేకుండా ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. ఎక్కడైనా ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఎస్ఐ రవీంద్ర కోరారు.

అద్దరవీధి కల్వర్టు బురదమయం

▸▸ ఆదివాసీలకు తప్పని అవస్థలు


బురదగా మారిన అద్దరవీధి కల్వర్టు ప్రాంతం

గూడెంకొత్తవీధి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అద్దరవీధి కల్వర్టు బురదమయమైంది. ఈమార్గంపై రాకపోకలు సాగించే ఆదివాసీలు అవస్థలు పడుతున్నారు. గత ఏడాది కురిసిన వర్షాలకు అద్దరవీధి కల్వర్టు కొట్టుకుపోయింది. దీంతో కొండవాగుల నుంచి వచ్చే వర్షపునీరు పంట పొలాలకు వెళ్లకుండా సీలేరు-జీకేవీధి ప్రధాన రహదారిపై ప్రవహించేది. ఈ సమస్యపై 'ఆంధ్రజ్యోతి' ఈనెల 11తేదీన 'వానోచ్చే..వరదొచ్చే' శీర్షిక కథనం ప్రచురించడంతో ఎస్ఎంఐ జిల్లా అధికారులు స్పందించి అద్దరవీధి కల్వర్టు పునర్నిర్మాణం పనులు ప్రారంభించారు. నిర్మాణ బాధ్యతలు పొందిన కాంట్రాక్టర్ అద్దరవీధి కల్వర్టు వద్ద తూరాలు నిర్మించి పంట పొలాలకు నీరు అందేలా ఏర్పాటు చేశారు. అయితే కల్వర్టు వద్ద కాంక్రీట్ వేయలేదు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కల్వర్టు బురదమయమైంది. ఈమార్గంపై ప్రయాణించే వాహనాలు కల్వర్టు బురద వద్ద కూరుకుపోతున్నాయి. ఇప్పటికైన ఎస్ఎంఐ అధికారులు స్పందించి అద్దరవీధి కల్వర్టు వద్ద సిమెంట్ కాంక్రీట్ పనులు చేపట్టాలని ప్రాంతీయులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉత్సాహంగా వినాయకుడి నిమజ్జనం


పాడేరులో వినాయక నిమజ్జనంలో పాల్గొన్న భక్తులు


సీలేరులో వినాయకుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

చింతపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంజలి శనివారం గ్రామంలో వినాయకుడి నిమజ్జనం ఆదివారం ఘనంగా జరిగింది. ఆదివారం ఉదయం గణపతికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. వినాయక లడ్డుని గ్రామానికి చెందిన కిముడు కోటేశ్వరరావు, ఈశ్వరమ్మ దంపతులు రూ.47,216కి వేలం పాట ద్వారా దక్కించుకున్నారు. చింతపల్లి డిగ్రీ కళాశాల పీడీ కిముడు శివరామ్ కుమార్ ఉత్సవ కమిటీకి టీషర్టులను అందజేశారు. సాయంత్రం గిరిజన సంప్రదాయ నృత్య ప్రదర్శనలతో వినాయక ఊరేగింపు ప్రారంభమైంది. అనంతరం గ్రామ వాగులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సాగిన వెంగళరావు, గ్రామపెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు జె. బాబూరావు, కె. నారాయణరావు, ఎల్.బాబూరావు, బెన్నలింగం, అర్చకుడు మంగన్నదొర పాల్గొన్నారు.

పాడేరులో..

పాడేరురూరల్: పాడేరులో ఆదివారం వినాయక విగ్రహాలను నిమజ్జన కార్యక్రమాలను నిర్వాహకులు చేపట్టారు. వినాయక విగ్రహాలను ఉత్సవ కమిటీ ప్రతినిధులు సాంస్కృతిక కార్యక్రమాలు, మందుగుండు సామగ్రితో పట్టణంలో భారీ ఊరేగింపుగా వెళ్లి చిలకలగెడ్డలో నిమజ్జనం చేశారు. వివిధ మండపాల వద్ద అన్నసమారాధనను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయ ఆధ్యాత్మిక సేవా బృందం సభ్యులు యామీ.రత్నం, ఉప్పల వైదేహి, చీపురు రమాదేవి, వంతినిభ రాజుబాబు, కొట్టగుళ్లి రామారావు, దేశిది బాబూరావు, కొమ్మోజి వెంకటరమణ, సిద్దినాతి కొండలరావు, బీవీఎస్.ముకుందరావు, బి.రమణ తదితరులు పాల్గొన్నారు.

సీలేరులో..

సీలేరు పోలీస్ స్టేషన్‌లో సీఆర్‌పీఎఫ్ ఎఫ్42 బెటాలియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. వినాయకుని సన్నిధిలో హోమం, ప్రత్యేక పూజలు కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటుచేశారు. సాయంత్రం వినాయక విగ్రహాన్ని సీలేరు పురవీధుల్లో యువకుల డ్యాన్స్‌లతో కోలాహలంగా గుంటవాడ జలాశయంలో నిమజ్జనం చేశారు.

జి.మాడుగులలో..

స్థానిక ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ ఆవరణలో సిద్ధి వినాయక యూత్ ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాన్ని ఆదివారం నిమజ్జనం చేశారు. సాయంత్రం వివిధ సంప్రదాయ నృత్యాలు, కోలాటాలతో వినాయకుడిని ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం జరిపించారు.

ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం కురుసా అప్పారావుకు ఘన సత్కారం

జి.మాడుగుల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల- 1లో ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడుగా పనిచేసి ఆదివారం పదవీవిరమణ చేసిన కురుసా అప్పారావును ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అప్పారావు వద్ద విద్యాభ్యాసం చేసి ఉద్యోగాలు పొందిన పూర్వ విద్యార్థులు, తోటి ఉపాధ్యాయులు, బంధువులు ఆయన సేవలను కొనియాడారు. వారంతా అప్పారావు, కాసులమ్మ దంపతులకు పూలమాలలు వేసి, శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎం.బాలరాజు, ఎంఈవోలు, అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు, కుటుంబీకులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.


కురుసా అప్పారావు, కాసులమ్మ దంపతులను సత్కరించిన స్కూల్ టీచర్లు

గిరిజనేతరుల ఎస్టీ సర్టిఫికెట్లు రద్దుచేయాలి

▸▸ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర చైర్మన్ రీమల నవభారత్

చింతపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొందిపాకలు, సమగిరి గ్రామాల్లో గిరిజనేతరులు పొందిన ఎస్టీ సర్టిఫికెట్‌లను రెవెన్యూ అధికారులు రద్దు చేయాలని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర చైర్మన్ రీమల నవభారత్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చింతూరు డివిజన్ దేవీపట్నానికి చెందిన గిరిజనేతరులు చింతపల్లి జోత్స్న ప్రియ, దుమ్ముల అనిత కుమారి, మధుబాబు, రాంబాబు గొందిపాకలు, సమగిరి గ్రామాల్లో నివాసముంటున్నట్టుగా తప్పుడు పత్రాలు సమర్పించి ఎస్టీ వాల్మీకి కుల ధ్రువీకరణ పత్రాలు మే నెలలో చింతపల్లిలో పొందారన్నారు. ఎస్టీ వాల్మీకిలో చింతపల్లి, దుమ్ముల ఇంటి పేర్లు లేవని, ఎస్టీ సర్టిఫికెట్లు పొందిన వ్యక్తులు స్థానికులు కాదన్నారు. వారి కుటుంబ సభ్యులు సైతం ఈ ప్రాంతంలో లేరన్నారు. దీనిపై గిరిజన ఉద్యోగుల సంఘం చింతపల్లి తహశీల్దార్‌కి ఫిర్యాదు చేసిందన్నారు. రెవెన్యూ అధికారులు తక్షణమే విచారణ చేపట్టి గిరిజనేతరులు పొందిన ఎస్టీ కులధ్రువీకరణ పత్రాలను రద్దుచేయాలన్నారు.

వినాయకునికి ప్రత్యేక పూజలు


వినాయక పూజలో పాల్గొన్న భక్తులు

పాడేరురూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): పాడేరు పట్టణంలోని ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో వినాయక విగ్రహానికి ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, రమాదేవి దంపతులు, భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఉప్పల రామం పంతులు వినాయక విగ్రహానికి గరికతో అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

రచ్చపల్లి వరి రైతులను ఆదుకోవాలి

జి.మాడుగుల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగర్భ పంచాయతీ రచ్చపల్లి వరి పొలాలకు తెగులు సోకి పంట నష్టపోయామని రైతులు బోయిని వెంకటేశ్వర్లు, బి.లక్ష్మణరావు, బి.సోమయ్య, కె.సన్యాసయ్య, తదితరులు వాపోయారు. తమను ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. తెగులు సోకి వరి పంట దెబ్బతిందన్నారు. వ్యవసాయాధికారులు వచ్చి తమకు తగిన సూచనలు చేయాలన్నారు.

వయోజన విద్య సూపర్‌వైజర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పాడేరురూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో వయోజన విద్య సూపర్‌వైజర్లుగా పనిచేయడానికి ఆసక్తి గల ఉపాధ్యాయులు ఈనెల 5వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. విద్యాశాఖలో ఎస్జీటీలు, పీఈటీలు, గ్రేడ్-2 భాషా పండిట్‌లుగా పనిచేస్తున్న 45 ఏళ్ల కంటే తక్కువ వయస్సు కలిగిన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఫారిన్ సర్వీస్ నిబంధనలు, షరతుల కింద డిప్యూటేషన్‌పై ఏడాది పాటు జిల్లాలో పనిచేయాలన్నారు. ఈనెల 5వ తేదీ లోగా విశాఖ జిల్లా వయోజన విద్య సంచాలకుల కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. దరఖాస్తులు చేసుకున్న ఉపాధ్యాయులకు ఈనెల 9వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల ఉపాధ్యాయులు పూర్తి వివరాలకు 8247012136 ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు.

'డేగలరాయికి రహదారి వేయాలి'

జి.మాడుగుల, ఆగస్టు 31 (ఆంధ్రజోతి) : సొలభం పంచాయతీ డేగలరాయి గ్రామానికి రహదారి నిర్మించాలని స్థానికులు డిమాండ్ చేశారు. ప్రధాన రహదారి నుంచి గ్రామం వరకు మూడు కిలోమీటర్ల మేర రహదారి లేదన్నారు. అత్యవసర సేవలకు ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. రోడ్డు నిర్మాణం చేపడితే కంఠవరం వరకు రెండు గ్రామాలకు సేవలు అందుతాయని ఎస్.కొండలరావు, ఎస్.నాగరాజు, రమేశ్‌బాబు, కె.చిట్టిబాబు, సత్తిబాబు, మత్స్యరాజు కోరారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టులు నిర్మిస్తే మరో ఉద్యమం

▸▸ సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు లోకనాథం


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు లోకనాథం

అరకులోయ, అగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : అల్లూరి జిల్లాలో హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణానికి కార్పొరేట్ బడా సంస్థలైన అదానీ, నవయుగ కంపెనీలను ప్రోత్సహిస్తే మరో ఉద్యమం తప్పదని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం హెచ్చరించారు. ఇక్కడి గిరిజన సంఘ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హైడ్రో పవర్ ప్రాజెక్టులు మన్య ప్రాంతంలో వద్దని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ గత వైసీపీ ప్రభుత్వం బడా కార్పొరేట్ సంస్థలకు బాసటగా నిలిచిందని ఆరోపించారు. నాడు ప్రతిపక్షంలో ఉన్న కూటమి నాయకులు వ్యతిరేకించి, నేడు అధికారంలోకి రాగానే ఏ విధంగా ప్రోత్సహిస్తారని ఆయన ప్రశ్నించారు. మన్యంలో సాగు భూములను, అటవీ భూములను, గిరిజన గ్రామాలను జలమయం చేసే ఇటువంటి ప్రాజక్టులను అంతా ముక్తకంఠంతో వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో చట్టాలను తుంగలోకి తొక్కేందుకు వెనుకాడడం లేదని, ఇటువంటి పరిస్థితుల్లో గిరిజనులు ఉద్యమబాట పడితేనే ప్రభుత్వాలు దిగి వస్తాయని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కిల్లో సురేంద్ర, అల్లూరి జిల్లా కార్యదర్శి అప్పలనర్స, అనంతగిరి జడ్పీటీసీ సభ్యుడు దీసరి గంగరాజు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులను గుర్తించాలి

▸▸ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి ▸▸ పరికరాల కొనుగోలుకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలి

▸▸ జిల్లా భవన నిర్మాణ కార్మికుల సంఘ మహా సభలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు



మహా సభలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

అరకులోయ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. ఇక్కడి గిరిజన సంఘ కార్యాలయంలో ఆదివారం జరిగిన అల్లూరి జిల్లా భవన నిర్మాణ కార్మికుల సంఘం ద్వితీయ మహా సభలో మాట్లాడారు. భవన నిర్మాణాల్లో నిరుద్యోగులు పెద్ద ఎత్తున కూలీలుగా వస్తున్నారన్నారు. తక్షణమే ప్రభుత్వం వారిని గుర్తించి సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు. కార్మికులకు వృత్తి పరికరాల కొనుగోలుకు బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని, ప్రభుత్వ భవన నిర్మాణాల్లో స్థానిక కార్మికులకు ఉపాధి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సంక్షేమ బోర్డును పునరుద్ధరించకుంటే భవిష్యత్తులో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద పెద్దఎత్తున ఆందోళన చేపట్టేందుకు కార్మికులు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే, సెప్టెంబరు పదిహేనో తేదీన విజయవాడలో జరగనున్న కార్మిక కమిషనర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని అంతా జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవి, సింహాచలం, సోమునాయుడు, చిన్న, ప్రభుదాస్, శ్రీనులతో పాటు పాడేరు, ముంచంగిపుట్టు, డుంబ్రిగుడ, హుకుంపేట, అనంతగిరి మండలాల నుంచి పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.


గ్రామస్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాసరావు

గ్రామస్థులంతా ఐక్యంగా ఉండాలి

అనంతగిరి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో స్నేహపూరిత వాతావణాన్ని నెలకొల్పాలని ఎస్ఐ డీ.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని చిలకలగెడ్డ పంచాయతీ జీలుగులపాడు గ్రామంలో ఆదివారం గ్రామస్థులకు ఏర్పాటైన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. గ్రామంలో ఎటువంటి గొడవలు లేకుండా అంతా ఐక్యంగా ఉండాలన్నారు. అసాంఘిక కార్యకలపాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. గంజాయి వంటి మత్తు పదార్థాల జోలికి వెళ్లి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. గ్రామాల్లో పరిస్థితులపై తమకు సమాచారం ఇవ్వాలన్నారు.

కేజీహెచ్‌లో క్యాన్సర్‌కు అత్యాధునిక వైద్యం

... 3వ పేజీ తరువాయి

వైద్యులు చెబుతున్నారు. ఈ పరికరాల సాయంతో మెదడు నుంచి కాలిబొటన వేలి వరకూ వచ్చే ఏ క్యాన్సర్‌కు అయినా మెరుగైన చికిత్సను అందిస్తామని విభాగాధిపతి డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. అర సెంటీమీటర్ నుంచి 40 సెంటీమీటర్ల పరిమాణం ఉన్న ఏ క్యాన్సర్‌కైనా వైద్య సేవలను సులభంగా, అత్యాధునిక పద్ధతుల్లో అందించేందుకు అవకాశం ఉందన్నారు. ఈ పరికరాలతో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని కేజీహెచ్ సూపరిం టెండెంట్ డాక్టర్ వాణి తెలిపారు.

జలాశయాలకు వరద పోటు

... 3వ పేజీ తరువాయి

నీటిమట్టం 137 మీటర్లు కాగా ఆదివారం సాయంత్రానికి 136.55 మీటర్లకు చేరింది. రాత్రి తొమ్మిది గంటలకు స్పిల్‌వే మూడో గేటు తెరిచి 350 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడిచిపెడతామని జలాశయం ఏఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం రాచకట్టు కాలువకు 10 క్యూసెక్కులు, కుడి ప్రధాన కాలువకు 50 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్టు వెల్లడించారు.

స్వల్పంగా పెరిగిన కల్యాణపులోవ నీటి మట్టం

రావికమతం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీమలపాడు పంచాయతీ పరిధిలో వున్న కల్యాణపులోవ రిజర్వాయర్‌లో నీటి నిల్వలు క్రమం పెరుగుతున్నాయి. జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 460 అడుగులు కాగా ఆదివారం 80 క్యూసెక్కుల వరద నీరు వచ్చిచేరుతూ 453.02 అడుగులకు పెరిగింది. వారం రోజుల్లో నీటి మట్టం మూడు అడుగుల పెరిగినట్టు ప్రాజెక్టు ఏఈ సూర్య తెలిపారు. ఆయకట్టుకు సకాలంలో నీటిని విడుదల చేయడంతో పాటు రెండు వారాల నుంచి వర్షాలు సమృద్ధిగా కురుస్తుండడంతో 75 శాతం విస్తీర్ణంలో వరినాట్లు పూర్తయినట్టు ఆయన చెప్పారు. ఖరీఫ్‌కు నీటి ఎద్దడి తలెత్తే అవకాశం లేదని ఆయన స్పష్టం చేశారు.

రైలు నుంచి జారిపడి అంధుడికి గాయాలు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి రైల్వే స్టేషన్‌కు సమీపంలోని శంకర్ ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఆదివారం తెల్లవారుజామున గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి ప్రమాదవశాత్తూ జారిపడి ఓ అంధుడు తీవ్ర గాయాలకు గురయ్యాడు. ఈ సమాచారం తెలుసుకున్న ఆర్‌పీఎఫ్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడ్ని ఎన్టీఆర్ వైద్యాలయంలో ప్రథమ చికిత్సల అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. గాయపడ్డ వ్యక్తి విజయనగరం జిల్లా భోగాపురం గ్రామానికి చెందిన వ్యక్తిగా తెలిసింది.

పేకాట ఆడుతున్న పది మంది అరెస్టు

▸▸ రూ.61,300, నాలుగు ద్విచక్ర వాహనాలు, ఆటో స్వాధీనం

కశింకోట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెర కాం- అడ్డాం గ్రామాల పరిసర ప్రాంతాల్లో ఆదివారం పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఇందుకు సంబంధించి సీఐ అల్లు స్వామినాయుడు తెలిపిన వివరాలివి. జీడి తోటలో పేకాట ఆడుతున్నారని అందిన సమాచారం మేరకు ఎస్ఐ మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేశారన్నారు. ఈ సందర్భంగా పది మందిని అదుపులోకి తీసుకోవడంతో పాటు రూ.61,300 నగదు, నాలుగు ద్విచక్ర వాహనాలు, ఆటోను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

గజానికో గొయ్యి!


ఎరుకునాయుడుపాలెం సమీపంలో రోడ్డుపై ఏర్పడిన గోతులు

... 3వ పేజీ తరువాయి

చేయించారు. దీంతో గత మార్చిలో లంకెలపాలెం నుంచి పైడివాడఅగ్రహారం వరకు రహదారికి నిర్వహణ పనులు చేశారు. అక్కడి నుంచి అనకపల్లి వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర రహదారిపై ఏర్పడిన గోతులను మెటల్, క్రషర్ బుగ్గితో కప్పారు. అయితే గత పక్షం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో క్రషర్ బుగ్గితోపాటు మెటల్ కూడా కొట్టుకుపోయి, గోతులు మళ్లీ ప్రత్యక్షం అయ్యాయి.

రూ.2 కోట్లు మంజూరు

బాలరాజు, ఏఈ, ఆర్‌అండ్‌బీ

అనకపల్లి నుంచి పైడివాడఅగ్రహారం వరకు మూడు కిలోమీటర్ల మేర రోడ్డును అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం రూ.2 కోట్లు మంజూరు చేసింది. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున పనులు చేయడానికి వీలుకాదు. త్వరలోట టెండర్ల ప్రక్రియను పూర్తిచేసి, వర్షా కాలం ముగిసిన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

కుక్కల బీభత్సం.. కోతుల వీరంగం!

గ్రామాల్లోకి గుంపులు గుంపులుగా వస్తున్నాయి.. మూకుమ్మడిగా సంచరిస్తున్నాయి.. రహదారులపై నిర్భయంగా తిరుగుతున్నాయి.. తలుపులు తెరిచి ఉంటే ఇళ్లల్లోకి చొరబడుతున్నాయి.. దొరికినకాడికి ఆహార పదార్థాలను పట్టుకుపోతున్నాయి.. వస్తువులను చిందరవందరగా పడేస్తున్నాయి.. చిన్నారులపై కలబడుతున్నాయి.. ఎవరైనా ఒంటరిగా కనిపిస్తే దాడులకు తెగబడుతున్నాయి.. వాహన చోదకుల వెంటబడుతున్నాయి.. ఏమాత్రం భయపడినా మీదపడి తరుముతున్నాయి.. ఇదీ మాడుగుల మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో కుక్కలు, కోతులు సృష్టిస్తున్న బీభత్సం!

మాడుగులలో రేయింబవళ్లు స్వైరవిహారం

- రహదారులపై గుంపులు గుంపులుగా సంచారం
- తలుపులు తెరిచి ఉంటే ఇళ్లల్లోకి ప్రవేశం
- చిన్నారులపై దాడులకు తెగబడుతున్న వైనం
- వాహన చోదకుల వెంటబడుతున్న గ్రామ సింహాలు
- గత మూడు నెలల్లో దాదాపు 80 కుక్క కాటు కేసులు
- ఏమాత్రం పట్టించుకోని అధికారులు, పాలకులు
- భయాందోళనలో వాహన చోదకులు, ప్రజలు

మాడుగుల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మాడుగుల మండల కేంద్రంలోని ఏ ప్రాంతంలో చూసిన కుక్కలు గుంపులుగా దర్శనమిస్తున్నాయి. వీటిని దాటుకుని వెళ్లేందుకు ప్రజలు, వాహన చోదకులు భయభ్రాంతులకు గురవుతున్నారు. పైగా అదే మార్గం నుంచి నిత్యం పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లే చిన్నారులపై కూడా కుక్కలు దాడులకు తెగబడుతున్నాయని తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. వీటికి తోడు గ్రామాల్లో కోతులు వీరంగం వేస్తున్నాయి. వాటిని బెదిరించి చెదరగొడదామన్నా మూకుమ్మడిగా మీదకు వస్తుండడంతో జనం భయంతో పరుగులు తీయాల్సి వస్తోంది. పెద్దల సంగతి ఎలా ఉన్నా చిన్నారులపై కుక్కలతో పాటు కోతులు దాడులకు ఉపక్రమిస్తున్నాయి. రాత్రి సమయాల్లో మూగజీవాలపై కుక్కలు దాడులకు తెగబడుతున్నాయి. వాహన చోదకుల వెంటబడి గాయపరుస్తున్నాయి.



మాడుగుల మండల కేంద్రంలో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు



మాడుగుల మోదమాంబ కాలనీలో సంచరిస్తున్న కోతులు... (ఇన్‌సెట్‌లో) ఓ ఇంటిలోకి ప్రవేశిస్తున్న కోతులు

మూడు నెలల్లో 80 కుక్క కాటు కేసులు

మాడుగుల మండల కేంద్రంతో పాటు ఎం.గదబూరు, రామచంద్రపురం, ఎం.కోడూరు, జంపెన, ఘాట్ రోడ్డు తదితర ప్రాంతాల్లో కుక్కల వీరవిహారం అధికం కావడంతో ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని, ఎప్పుడు దాడికి తెగబడతాయోనని ప్రజలు, వాహన చోదకులు భయాందోళన చెందుతున్నారు. గత నెల మూడు నెలల్లో దాదాపు 80 మంది కుక్క కాటుకు గురయ్యారు. ఇవన్నీ ప్రభుత్వ ఆస్పత్రుల్లో నమోదైన వివరాలు కాగా, ఇక ప్రైవేటు ఆస్పత్రులలో చికిత్స చేయించుకునే వారు చాలా మంది ఉన్నారు.



మాడుగుల-ఎ.కోడూరు రహదారి పక్కన గ్రామంలో కుక్కల సంచారం

కోతుల బాధితులూ ఎక్కువే..!

కుక్కలకు తోడు మరోవైపు కోతుల బెడద ఎక్కువైందని జనం ఆందోళన చెందుతున్నారు. మాడుగుల కేంద్రంతో పాటు మోదమాంబ కాలనీ, తుడుంవీధి, నిర్మల కాలనీ, గవరవీధి, నూకాలమ్మ కాలనీ తదితర ప్రాంతాల్లో కోతులు ఎక్కువగా సంచరిస్తున్నాయి. గత మూడు నెలల్లో కోతుల దాడుల్లో గాయపడిన బాధితులు దాదాపు 20 మంది ఉన్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి వీధి కుక్కలు, కోతుల బెడద లేకుండా తక్షణమే తగిన చర్యలు చేపట్టాలని, వాటి బారి నుంచి తమను రక్షించాలని ప్రజలు, వాహన చోదకులు వేడుకుంటున్నారు.



మాడుగుల ఘాట్ రోడ్డు జంక్షన్‌లో గుంపుగా తిష్ఠ వేసిన కుక్కలు

4న రక్తదాన శిబిరాలు

- నర్సీపట్నం, పెదబొడ్డేపల్లిలో ఏర్పాటు
- స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు



నర్సీపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం, పెదబొడ్డేపల్లిలో ఈ నెల 4న మెగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్టు స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు తెలిపారు. ఆదివారం తన క్యాంప్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తన పుట్టిన రోజు సందర్భంగా ఉదయం 8 గంటల నుంచి ఈశిబిరాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఆయన పిలుపునిచ్చారు. పుట్టిన రోజు వేడుక కన్నా రక్తదాన శిబిరానికే ప్రాధాన్యత ఇవ్వాలని అనుకుంటున్నానని తెలిపారు. గత ఏడాది అందుబాటులో లేకపోవడంతో రక్తదాన శిబిరం నిర్వహించలేక పోయానన్నారు. రెడ్ క్రాస్, ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్‌లతో పాటు నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి బ్లడ్ సెంటర్ సహకారం తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. నర్సీపట్నం గ్రామీణం, పట్టణం, గొలుగొండ, నాతవరం మండలాల దాతలు ఏరియా ఆస్పత్రిలో, మాకవరపాలెం, బలిఘట్టం, పెదబొడ్డేపల్లి, ధర్మసాగరం, లక్ష్మీపురం దాతలు మార్కెట్‌యార్డులో రక్తదానం చేయాలని కోరారు. సోమవారం పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో గ్రామాలలోని టీడీపీ నాయకులు స్వయంగా పాల్గొని లబ్ధిదారులకు అందించాలని సూచించారు.

జన్నవరం సహకార సంఘం చైర్‌పర్సన్‌గా గౌరీశంకర్



చోడవరం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జన్నవరం సహకార సంఘం చైర్‌పర్సన్‌గా మజ్జి గౌరీ శంకర్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సహకార సంఘం పర్సన్ లుగా ఎలిశెట్టి శ్రీనివాసరావు, ఓలేటి నరసింగరావులను నియమించారు. సహకార సంఘం చైర్‌పర్సన్‌గా నియమితులైన మజ్జి గౌరీశంకర్ జిల్లా టీడీపీ యువత అధ్యక్ష పదవితో పాటు చోడవరం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కూడా పదవులు నిర్వహించారు.

95 శాతం వరి నాట్లు పూర్తి

- మండల వ్యవసాధికారి రమేశ్

రావికమతం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈ ఏడాది ఖరీఫ్ వరి నాట్లు కాస్త ఆలస్యమైనప్పటికీ 95 శాతం పూర్తయ్యాయని మండల వ్యవసాధికారి రమేశ్ తెలిపారు. మండలంలో ఈ ఏడాది 2,181 హెక్టార్లలో ఖరీఫ్ సాగుకు రైతులు సిద్ధమయ్యారన్నారు. అయితే వర్షాభావంతో రైతులు వరి నాట్లను ముందుగా వేయలేకపోయారన్నారు. ఇటీవల తుఫాన్ ప్రభావంతో భారీగా వర్షాలు పడడంతో కల్యాణపులోవ రిజర్వాయర్‌తో పాటు చెరువులు, వాగుల్లో పుష్కలంగా నీరు చేరడంతో నాట్లు వేసే పనిలో రైతులు నిమగ్నమయ్యారని చెప్పారు. ఇప్పటికే 2,050 హెక్టార్లలో వరి నాట్లు పూర్తి చేసినట్టు ఏవో తెలిపారు. వారం రోజుల్లో శతశాతం నాట్లు పూర్తి కావచ్చునని ఆశాభావం వ్యక్తం చేశారు.

నిరుపయోగంగా బాలికల హాస్టల్ భవనం



ప్రారంభానికి నోచుకోని భవనం ఇదే..

మాకవరపాలెం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిర్మించిన బాలికల వసతిగృహం భవనం నిరుపయోగంగా మారింది. ఈ భవన నిర్మాణం పూర్తిచేసి ఐదేళ్లు గడుస్తోంది. ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభమై నెలలు గుడుస్తున్నా భవనం ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా భవనం ప్రారంభించాలని విద్యార్థులు,వారి తలిదండ్రులు కోరుతున్నారు.

ఆడబిడ్డ నిధికి సీఎం చంద్రబాబు సిద్ధం

- ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి





సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు... (ఇన్‌సెట్‌లో) మహిళలతో ర్యాలీగా వెళుతున్న ఎమ్మెల్యే

చీడికాడ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఆడబిడ్డ నిధి అమలుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సిద్ధంగా ఉన్నారని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం నియోజకవర్గ స్థాయి స్త్రీశక్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చీడికాడ శివాలయం నుంచి కిలోమీటరు వరకూ భారీ ర్యాలీ చేశారు. కోలాటాలు, తప్పెడుగుళ్లతో మహిళలు సందడి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో మొదటిసారిగా పొదుపు ఉద్యమాన్ని తీసుకువచ్చి డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసిన ఘనత చంద్రబాబునాయుడేనన్నారు. ప్రతీ సంఘానికి రూ.20 లక్షలు వడ్డీ లేని రుణాలను అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సూపర్‌సిక్స్ పథకాల్లో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, పింఛన్ పెంపు, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు వంటి హామీలను అమలు చేస్తున్న ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. త్వరలో ఆడబిడ్డ నిధి అమలు, 50 సంవత్సరాలు దాటిన వారందరికీ పింఛన్ పథకాన్ని అమలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన చెప్పారు. మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రాన్ని అప్పులాంధ్రప్రదేశ్‌గా మార్చిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. 2014 ఎన్నికలు అయ్యేవరకూ కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 వేలు పింఛన్ అందజేస్తే దాన్ని రెట్టింపు పెంచిన ఘనత చంద్రబాబుదేనన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతల చిన్నంనాయుడు, పంచాడ దాలెంనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షులు గవిరెడ్డి జగన్నాథం, బొబ్బాది తాతారావు, నాయకులు గండి ముసలినాయుడు, యర్రా అప్పారావు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

మహిళల ఉజ్వల భవిష్యత్తే చంద్రబాబు లక్ష్యం

- త్వరలో మహిళలకు చట్టసభల్లో మరింత ప్రాతినిధ్యం
- 15 నెలల్లోనే హామీలు అమలుచేసిన ఘనత కూటమిదే
- స్త్రీశక్తి విజయోత్సవంలో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు, పక్కన హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ తాతయ్యబాబు

చోడవరం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలకు మరింత ఉజ్వల భవిష్యత్ కల్పనే సీఎం చంద్రబాబు లక్ష్యమని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. స్థానిక విఘ్నేశ్వరాలయం వద్ద ఆదివారం సాయంత్రం నిర్వహించిన స్త్రీశక్తి విజయోత్సవ సభలో ఎమ్మెల్యే రాజు మాట్లాడారు. మహిళలకు చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం, స్త్రీశక్తి, ఉచిత గ్యాస్ సిలిండర్లు, పింఛన్లు రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంపుతో సహా చాలా పథకాలు అమలు చేస్తున్నారన్నారు. తాజాగా రాష్ట్రంలో ఎక్కడికైనా ఉచితంగా ఆర్టీసీలో ప్రయాణించే సౌకర్యం మహిళలకు అందుబాటులోనికి తీసుకువచ్చారని వివరించారు. జగన్ పాలనలో అప్పులతో రాష్ట్రాన్ని ఊబిలో దించితే, ఆ అప్పులన్నీ తీర్చుకుంటూ ఒకటొకటిగా సంక్షేమ పథకాలు అమలు చేస్తుండడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలన్నీ అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే అమలుచేసి చూపించారన్నారు. త్వరలోనే అసెంబ్లీలో, పార్లమెంటులో మహిళలకు మరింత ప్రాతినిధ్యం కల్పించే దిశగా చంద్రబాబు ప్రభుత్వం సమాలోచనలు చేస్తున్నదన్నారు. అదే అమలైతే మహిళలు రాజకీయంగా మరింత పురోగతి సాధించడం తథ్యమన్నారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబు మాట్లాడుతూ త్వరలోనే మహిళలకు ఏడాదికి రూ.15 వేలు అందించే పథకం కూడా అమలు చేయబోతున్నదన్నట్టు తెలిపారు. కూటమి పాలనలో రాష్ట్రం మరింత అభివృద్ధి చేయడంతో పాటుయువతకు ఉద్యోగాలు ఉపాధి అవకాశాల కల్పనకు అన్ని చర్యలు చేపట్టిందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు కనిశెట్టి మత్స్యరాజు అధ్యక్షత జరిగిన ఈ సభలో గవర కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్, నియోజకవర్గంలోని నాలుగు మండలాల కూటమి నాయకులు గూనూరు మల్లునాయుడు, గేదెల సత్యనారాయణ, పూతి కోటేశ్వరరావు, మజ్జి గౌరీశంకర్, రాజాన కొండనాయుడు, చంద్రమౌళి, ఎర్రంశెట్టి చిన్న, ఎస్.కోటేశ్వరరావు, డీవీ అప్పారావు, జి.మూలినాయుడు, కె.రూపాదేవి పాల్గొన్నారు.

వినాయకుడికి మాజీ మంత్రి బూడి పూజలు

దేవరాపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యాలమ్మపాలెం, కన్నంనాయుడు కల్లాల వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపాలను మాజీ ఉప ముఖ్యమంత్రి బూడిముత్యాల నాయుడు ఆదివారం దర్శించుకున్నారు. వినాయక నవరాత్రులలో భాగంగా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం, వైసీపీ మండల అధ్యక్షుడు బూరేబాబూరావు, సర్పంచ్ చింతల వెంకటరమణ, నాయకులు లలితా నాయుడు, గండిపడాల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

నేరళ్ల కల్లాల్లో ఎడ్ల బండ్ల పరుగు ప్రదర్శన

దేవరాపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నేరళ్ల కల్లాల్లో వరసిద్ధి వినాయక నవరాత్రులలో భాగంగా ఆదివారం ఎడ్ల బండ్ల పరుగు ప్రదర్శన జరిగింది. విజేతలకు మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఎడ్ల పరుగు ప్రదర్శనను తిలకించడానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి రైతులు తరలివచ్చారు. నిర్వాహకులు బందం అప్పరాజు, డి.శంకర్ పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం

బుచ్చెయ్యపేట, ఆగస్టు 31 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని పి.భీమవరం గ్రామానికి చెందిన కంఠంరెడ్డి ధనసాయి ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఐటీఐ పూర్తిచేసిన సాయి ఎలక్ట్రికల్ పనులు చేస్తుంటాడు. వడ్డాది హైస్కూల్‌లో పనులు చేస్తున్న క్రమంలో బాలికలతో అసభ్యకరంగా ప్రవర్తించాడని ఫిర్యాదు అందడంతో హెచ్‌ఎంతో పాటు తల్లిదండ్రులు మందలించారు. ఈ విషయం తెలుసుకున్న సాయి తల్లితండ్రులు కూడా శనివారం రాత్రికి మందలించడంతో మనస్థాపానికి గురై ఆదివారం పురుగు మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న సాయిని కుటుంబీకులు ఆస్పత్రిలో చేర్చారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించారు. ఈ విషయమై ఎస్ఐ శ్రీనివాసరావును వివరణ కోరగా, స్టేట్‌మెంట్ నమోదుకు విశాఖపట్నం ఆసుపత్రికి వెళ్తున్నామని, వివరాలు తరువాత వెల్లడిస్తామని తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ

● క్లీనర్ మృతి.. డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

గంట్యాడ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఆగిఉన్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొన్న ఘటనలో క్లీనర్ మృతి చెందగా, డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన విజయనగరం జిల్లా గంట్యాడ మండలంలోని రామవరం గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. గంట్యాడ ఎస్ఐ సాయికృష్ణ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం అర్ధరాత్రి సమయంలో విశాఖపట్నం నుంచి బొబ్బిలి వైపు వెళ్తున్న ఓ లారీ టైర్ పంచర్ కావడంతో రామవరం హైవేపై బ్రిడ్జి సమీపంలో రోడ్డు పక్కనే నిలిపివేశారు. దీని వెనుకన మరో లారీని నిలిపివేశా రు. అయితే అదే దారిలో అతి వేగంగా వస్తున్న లారీ.. ముందు ఉన్న లారీని ఢీకొట్టింది. డ్రైవర్ నిద్రమత్తులో ఉండటంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో రెండో లారీలో క్లీనర్‌గా పనిచేస్తున్న అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలానికి చెందిన కోన వెంకటరమణ క్యాబిన్‌లో ఇరుక్కునిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందారు. అదే లారీలో ఉన్న డ్రైవర్ తీవ్రంగా గాయపడటంతో జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సాయికృష్ణ తెలిపారు.


పెదనందిపల్లిలో సామూహిక వ్రతాలు



సామూహిక వ్రతాలు చేస్తున్న బాల వికాస్ విద్యార్థులు

దేవరాపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదనందిపల్లిలో సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో బాల వికాస్ విద్యార్థులతో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. సత్యసాయి జోనల్ సమావేశం కన్వీనర్ రవిశంకరు అధ్యక్షతన ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో 108 మంది బాల వికాస్ విద్యార్థులు వ్రతాలు చేశారు. జిల్లా సత్య స్వాయి సేవాసమితి అధ్యక్షుడు కసిరెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ ఈ నెల 7న అనకాపల్లి కన్యకా పరమేశ్వరీ కల్యాణ మండపంలో సేవాదళ్ శిక్షణా కార్యక్రమం జరుగుతుందన్నారు. సుమారు వెయ్యి మందికి శిక్షణ ఇవ్వనున్నట్టు ఆయన తెలిపారు. రాష్ట్ర, అధ్యక్ష, కార్యదర్శులు హాజరవుతారన్నారు. బాలవికాస్ శంకరు, శ్రీరామమూర్తి, కన్నబాబు, భజనామండలి సభ్యులు పాల్గొన్నారు.

హౌసింగ్ కాలనీలో భారీ అన్నసమారాధన



నసరయ్యపేట హౌసింగ్ కాలనీలో అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

చోడవరం, ఆగసు 31 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు నరసయ్యపేట హౌసింగ్ కాలనీలో వినాయకచవితి ఉత్సవాల సందర్భంగా ఆదివారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలోపాల్గొని స్వామివారి ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమాన్ని నరసయ్యపేట హౌసింగ్ కాలనీ సభ్యులు నిర్వహించారు.

కృష్ణాదేవిపేటలో...



కృష్ణాదేవిపేటలో అన్నసంతరణలో పాల్గొన్న భక్తులు

కృష్ణాదేవిపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని ఏఎల్‌పురం, పాతకృష్ణాదేవిపేట, చోద్యం, లింగంపేట, సిహెచ్.నాగాపురం, కొంగసింగి తదితర గ్రామాల్లో ఆదివారం వినాయక నిమజ్జన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఏఎల్ పురం హైస్కూల్, వినాయకవీధి, గొల్లవీధి, ఎస్సీ కాలనీల్లో వినాయక విగ్రహాల వద్ద భారీ అన్నసమరాధన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వినాయక మండపాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అలాగే పలు సాంస్కృతి కార్యక్రమాల నడుమ బోడ్డేరు గెడ్డల్లో వినాయక నిమజ్జనం చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు రుత్తల రామకృష్ణ, నాయకులు గొర్లి లక్ష్మణ్, రుత్తల రమణ, నానిబాబు, జమీలు పాల్గొన్నారు.

చోడవరంలో రక్తదాన శిబిరం



శిబిరంలో రక్తదానం చేస్తున్న చిరంజీవి అభిమానులు.. చిత్రంలో ఎమ్మెల్యే రాజు

చోడవరం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రేమ సమాజం ఆవరణలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో చిరంజీవి అభిమానులు, కాపురాక్స్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రక్తదాతలను ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు అభినందించి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గూనూరు మల్లునాయుడు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు మత్స్యరాజు, స్థానిక నాయకుడు సకురు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అబ్బురపరిచిన బాలల సత్యసాయి శతనామ సంకీర్తన

కె.కోటపాడు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సత్యసాయి కోటపాడు సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సత్యసాయి శతనామ కార్యక్రమం భక్తులను అబ్బురపరిచింది. సత్యసాయి జిల్లా అధ్యక్షులు కశిరెడ్డి అప్పలనాయుడు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. బాల వికాస్ పిల్లలు శతనామావళి గీతాలను ఆలపించారు. అలాగే భక్తులు సత్యసాయి తత్వాన్ని అలవర్చుకొని కొంత సమయాన్ని స్వామి సేవకు అంకితం కావాలని ఈ సందర్భంగా కశిరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సమితి కన్వీనర్ బండారు నారాయణపాత్రుడు, ఉపాధ్యాయులు మండల మురళీకృష్ణ, బాల వికాస్ గురువులు బండారు రామలక్ష్మి, గాజువాక సమితి ఎడ్యుకేషన్ కో-ఆర్డినేటర్ ఎర్ర సంతోషి, జాయింట్ యూత్ కో-ఆర్డినేటర్ ఎస్.సాయి శంకర్, జె.జోత్స్న, పైలా ధరణి, కోటపాడు సమితి భజన మండలి కో-ఆర్డినేటర్ దార్ల గుర్రానాచారి, భీమేశ్వరరావు, కోలా శ్రీనివాసరావు, గోపి, రామకృష్ణ పాల్గొన్నారు.

ఆవాసాల్లో డంపింగ్ యార్డు తొలగించాలని నిరసన

రావికమతం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఆవాసాల మధ్య తీవ్ర ప్రజారోగ్యానికి హాని కలిగించే డంపింగ్ యార్డును తక్షణమే తొలగించాలని అంబేడ్కర్ కాలనీ వాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఎం ఆధ్వర్యంలో చెత్త కుప్పల వద్ద ఆదివారం నిరసన తెలిపారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు మాట్లాడుతూ మండల కేంద్రంలోడంపింగ్ యార్డుకు స్థలం కేటాయించకపోవడం పాలకులు, అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఇక్కడ భూముల విలువ పెరిగిపోవడంతోఅక్రమణలకు గురవుతున్నాయని, దీంతో స్థల సమస్య షాక్ చూపి ఆవాసాల మధ్యనే చెత్త డంపింగ్ చేస్తున్నారని వాపోయారు. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	113.00
లైవ్ ధర	133.00
విత్ స్కిన్	236.00
స్కిన్ లెస్	246.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	565
విజయనగరం	569
శ్రీకాకుళం	569